క్లుప్తంగా

చికెన్ వ్యర్థాల అడ్డగింత



మడికొండ: చికెన్ సెంటర్ నుంచి సేకరించిన వ్యర్థాలను వ్యాన్‌లో మడికొండలోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నట్లు సమాచారం అందగా అడహక్ కమిటీ సభ్యులు డంపింగ్ యార్డుకు చేరుకుని అడ్డుకున్నారు. వాహనదారుడిని నిలదీయగా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చా రు. దీంతో వాహనాలను తిరిగి మరో చోటుకు తరలించారు. ఎన్ని రోజుల నుంచి చికెన్ వ్యర్థాలను వేస్తున్నారో తెలియడం లేదని అడ్‌హక్ కమిటీ సభ్యులు, ప్రజలు వాపోతున్నారు. అధి కారులు స్పందించి డంపింగ్ యార్డును ఇక్కడ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

పనులు ప్రారంభించండి



హసన్‌పర్తి: వచ్చే నెల 27వ తేదీన దేవన్నపేటలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ బహిరంగ సభ పనులు ప్రారంభించాలని మాజీ మంత్రి దయాకర్‌రావు సూచించారు. బహిరంగ సభ నిర్వహించనున్న ప్రదేశాన్ని మాజీ మంత్రి దయాకర్‌రావు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్, చల్లా ధర్మారెడ్డి ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా పార్కింగ్, సమావేశపు వేదిక ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దివ్యారాణి, నాగుర్ల వెంకటేశ్వర్లు, నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, చింతం సదానందం, రాజునాయక్, బండి రజనీకుమార్, రవి, రఘు, పావుశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

సందీప్‌కుమార్‌కు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జియాలజీ విభాగం పరిశోధకుడు సందీప్‌కుమార్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఆ విభాగం ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి పర్యవేక్షణలో సందీప్ కుమార్ తన పీహెచ్‌డీ పూర్తిచేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ పేర్కొన్నారు.

చైతన్యడీమ్డ్ వర్సిటీనుంచి..

కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ హనుమకొండకు చెందిన మహ్మద్‌ముఖీద్‌కు డాక్టరేట్‌ను ప్రకటించింది. మహ్మద్ ముఖీద్ ప్రొఫెసర్ నర్సింహాస్వామి పర్యవేక్షణలో తన పరిశోధన పూర్తిచేశారు. ఈనెల 22న హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో మహ్మద్ ముఖీద్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

బొడ్రాయికి పూజలు



ఖిలా వరంగల్: వరంగల్ ఎస్‌ఆర్‌ఆర్‌తోటలో ఆదివారం గ్రామదేవత శ్రీలక్ష్మీ, భూలక్ష్మి బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. బొడ్రాయి ప్రతిష్టాపన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తాటిపాముల భిక్షపతి, చిలువేరు రవీందర్, బండారి పూర్ణచందర్ ఆధ్వర్యంలో గ్రామ దేవత బొడ్రాయికి పూజలు నిర్వహించారు. బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవానికి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి పూజలు చేశారు. ముఖ్యఅతిథులుగా కార్పొరేటర్లు పద్మ, రవి, అరుణ, సుధాకర్, మాజీ కార్పొరేటర్ వేణు, నాయకులు కుమారస్వామి, శంకర్ హాజరయ్యారు. బొడ్రాయి ఉత్సవాల ఆదాయ లావాదేవీల పుస్తకాన్ని ఆవిష్కరించారు.

పొదుపుతో ఉపయోగం

వరంగల్: ప్రతి వ్యక్తి కుటుంబ ఆర్థిక అవసరాలకు పొదుపు ఎంతో ఉపయోగపడుతుందని కాశిబుగ్గలోని యునైటెడ్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధ్యక్షుడు, కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం సంఘం 40వ సర్వసభ్య వార్షికోత్సవ సమావేశం తిలక్‌రోడ్‌లోని కేవీఎస్ గార్డెన్స్‌లో జరిగింది. రామ రమేష్, ప్రకాష్, థామస్, రామకృష్ణ, శ్వేతాబాబు, భాస్కర్, రాజు, స్వామి పాల్గొన్నారు.

'కార్మికులను మోసం చేసింది కాంగ్రెస్ నాయకులే'

నయీంనగర్: అజాంజాహి మిల్లు కార్మికులు ఎక్కడ కోరితే అక్కడ స్థలం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ విమర్శించారు. ఆదివారం హనుమకొండ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో నరేందర్ మాట్లాడుతూ అజాంజాహి మిల్లు స్థలాలనే ఇస్తామని కార్మికులను నమ్మించి ఎన్నికల్లో ఓట్లు వేయించుకొని మోసం చేశారన్నారు. 2015లో కొండా సురేఖ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎంఆర్‌ఓ ద్వారా సర్వే నంబర్ మార్చారన్నారు. కార్మిక భవనం సర్వే నంబర్ మార్చి గొట్టిముక్కల నరేష్ రెడ్డికి అప్పగించారని, మున్సిపల్ పరిధిలో ఇంటి నంబర్ ఉన్న భవనాన్ని మ్యుటేషన్ చేసిన ఎంఆర్‌ఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య.. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే కాంగ్రెస్ హయాంలో అజాంజాహీ మిల్లు మూతపడిందన్నారు.

మార్కెట్‌కు మోక్షమెప్పుడో..?

- స్థల సేకరణలో జాప్యం
- ఇక్కట్లలో చేపల వ్యాపారులు, వినియోగదారులు



కాజీపేట ప్రధాన రహదారిపై చేపల మార్కెట్

కాజీపేట: కాజీపేట పట్టణంలో చేపల మార్కెట్ నిర్మాణానికి స్థల గ్రహణం వీడడం లేదు. దీంతో వినియోగదారులు, విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం బాపూజీనగర్ ప్రధాన రహదారిపైనే కొన్నేళ్లుగా చేపల అమ్మకాలు కొనసాగుతున్నాయి. ప్రధాన రహదారిపై పరదాలు కట్టుకుని వ్యాపారులు విక్రయాలు సాగిస్తున్నారు. చేపల వ్యాపారులను మార్కెట్‌లోకి తరలించాలనే ప్రతిపాదనలు ఉన్నా.. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కడిపికొండ శివారులోని ప్రభుత్వ భూమిలో ఇటీవల రూ.60 లక్షల ప్రభుత్వ నిధులతో నిర్మించిన రేకుల షెడ్డులు నిరుపయోగంగా మారాయి. వీటిలోకి చేపల మార్కెట్‌ను తరలించాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించినా అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో రోడ్డునే నమ్ముకుని చేపలు అమ్ముకుంటూ మహిళలు ఇబ్బందులు పడ్తున్నారు.

రోడ్డు వెడల్పుతో ఉపాధి కరువు...

ఇటీవల నగర విస్తరణలో భాగంగా అధికారులు చేపట్టిన కూల్చివేతలతో చేపల విక్రయదారులు రోడ్డున పడే పరిస్థితులు ఏర్పడ్డాయి. అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేతలు చేపట్టడంతో ఉపాధిని కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా చేపల మార్కెట్‌కు అనువైన స్థలాన్ని కేటాయించాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలి..



కాజీపేట పట్టణంలో సరైన చేపల మార్కెట్ లేకపోవడంతో కొనుగోలుదారులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్‌కు సరైన స్థలాన్ని కేటాయించడానికి అధికారులు చొరవచూపి, సమస్యను త్వరగా పరిష్కరించాలి.

– అప్పాల మహేందర్, కాజీపేట

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

- 40 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు

హన్మకొండ: సుదీర్ఘ కాలం తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. హనుమకొండ జిల్లా పరకాల సీఎస్‌ఐ 1984–1985 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం హనుమకొండ 100 ఫీట్ల రోడ్‌లోని వెంకటేశ్వరకాలనీలో కలుసుకున్నారు. 40సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారు ఒకరినొకరు అప్యాయంగా పలుకరించుకున్నారు. పదో తరగతి తర్వాత ఉన్నత విద్య అభ్యసించేందుకు వివిధ ప్రాంతాలకు వెళ్లిన వారు. అనంతరం ఉద్యోగాలు, వాప్యారాలు చేస్తూ బిజీగా గడుపుతూ ఎక్కడెక్కడో స్థిరపడ్డవారు.. 40ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకుని పాఠశాల నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు నరసింహ రామయ్య, పీఈటీ జేమ్స్, డి.కోర్నేల్, ఫాల్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులు ప్రారంభించాలి

- గణేష్‌నగర్‌లో స్థానికులు నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

మామునూరు: స్మార్ట్ సిటీలో భాగంగా మంజూరైన రూ.25లక్షల నిధులతో 43వ డివిజన్ గణేష్‌నగర్ కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదివారం స్థానికులు నిరసన తెలిపారు. మంజూరైన అభివృద్ధి పనులు తక్షణమే చేపట్టాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు కలిసి వినతిపత్రాలు అందజేసినా.. పట్టింపులేదని వాపోయారు. ఈ కాలనీకి మంజూరైన నిధులను ఇతర కాలనీలకు మళ్లించొద్దని స్థానికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. స్థానిక కార్పొరేటర్ కాలనీపై వివక్షత చూపుతున్నాడని ఆరోపించారు. కాలనీలో మట్టి రోడ్లు మరింత గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయని వాపోయారు. అధికారులు స్పందించి కాలనీకి మంజూరైన నిధులతో పనులు చేపట్టాలని కాలనీ ప్రతినిధి ఉమ్మగాని ఉమేష్‌గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో గంట సుమన్, చంద్రమౌళి పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

హన్మకొండ కల్చరల్ : వరంగల్ మట్టెవాడలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో ఆదివారం సాయంత్రం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, ఆర్య వైశ్య నాయకుడు గట్టు మహేష్‌బాబు హాజరై బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఆలయ అర్చకులు ఆరుట్ల రామాచార్యులు, ఆరుట్ల కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో మొదటి రోజు 25 కలశాలతో స్వామివారికి అభిషేకం, బాలభోగం, మంగళశాసనం, సామూహిక శ్రీవిష్ణుసహస్ర పారాయణం, విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ, పుణ్యాహవచనం, రక్షబంధనం, దీక్షస్వీకరణ, అంకురార్పణ పూజలు జరిపి శేషవాహన సేవ నిర్వహించారు. వేదప్రకాష్, పుల్లూరు మధు, గౌరిశెట్టి శ్రీనివాస్, వీరరావు, తోట నవీన్ పాల్గొన్నారు.

ఐకమత్యంతో అన్ని సాధించవచ్చు



సమ్మేళనంలో పాల్గొన్న కాలనీ వాసులు

వరంగల్: సమాజంలో ఐకమత్యంతో ఉంటే అన్ని రంగాల్లో ఫలితాలను సాధించవచ్చని కల్యాణినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గోలి చెన్నారెడ్డి అన్నారు. ఆదివారం దేశాయిపేటలోని కల్యాణి నగర్ కాలనీ వాసులు అరేపల్లి సమీపంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీలోని కుటుంబ సభ్యులంతా ఆనందంగా గడిపారు. అనంతరం కాలనీలోని కుటుంబ సభ్యులకు బహుమతులు అందజేశారు. కాలనీ పెద్దలు, కల్యాణి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి మధుసూదన్, గౌరవ అధ్యక్షుడు హరినాథ్, సలహాదారులు మల్లారెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సన్మానాలు.. సత్కారాలు



హసన్‌పర్తి: చైర్మన్ దంపతులను సన్మానిస్తున్న స్నేహితులు

హన్మకొండ: తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్‌ను ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. ఆదివారం హనుమకొండ పర్యటనకు వచ్చిన ఆయనను హనుమకొండలోని రహదారులు, భవనాల శాఖ అతిథి గృహంలో ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోషియేషన్–తెలంగాణ రాష్ట్ర కమిటీ మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మెపా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్, నాయకులు.. జ్ఞానేశ్వర్‌ను సన్మానించి, పెద్దమ్మతల్లి చిత్రపటాన్ని బహూకరించారు. బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ సొసైటీల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ కార్పొరేషన్ నిధులను ప్రతి జిల్లాకు పంచి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, ఆయా సంఘాల నాయకులు పొన్నం రాజు, రాజబోయిన రాజన్న, వినోద్ కుమార్, పల్లెబోయిన అశోక్, పులి రజనీకాంత్, రాజకుమార్, రాజన్న, అశోక్, కుమార్, చిరంజీవి, ఎస్.రాజు, రామకృష్ణ, భాస్కర్, సమ్మయ్య, రమేష్, రవీందర్, కృష్ణ, శ్యామ్, వినోద్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్‌కు..

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి దేవస్థాన కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఆరెల్లి వెంకటస్వామి దంపతులను ఆదివారం ఘనంగా సన్మానించారు. వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో వినాయక పరపతి సంఘం(1989–90 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్) ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు గుడికందుల సురేష్, కార్యదర్శి యాదగిరి, వంశీ, నాగేందర్, రవి, కిరణ్, సంపత్, కుమారస్వామి, రమేష్ పాల్గొన్నారు.

సత్కారం

ఖిలా వరంగల్: తెలంగాణ రాష్ట్ర సమాఖ్య అధ్యక్షుడు వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన మొగిలిచెర్ల సుదర్శన్ 34 సంవత్సరాలుగా వినియోగదారుల విశేషమైన సేవలు అందిస్తున్నారు. ఈమేరకు ఆదివారం హిమాచల్ సిమ్లాలో జరిగిన జాతీయ సమాఖ్య సమావేశంలో సుదర్శన్‌కు జాతీయ సమాఖ్య చైర్మన్ డాక్టర్ అనంతశర్మ, ఎంపీ భూపేంద్ర కశ్యాప్ మెమెంటోను అందజేసి సత్కరించారు.

బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ఫౌండేషన్ బాధ్యులు

విద్యారణ్యపురి/హన్మకొండ చౌరస్తా: కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న హనుమకొండలోని కొత్తూరు జెండా ప్రాంతానికి చెందిన మార్త సంపత్‌కు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేలు ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పులి దేవేందర్ మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ద్వారా వివిధ సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సంపత్ పిల్లలు బీ ఫార్మసీ, ఇంజనీరింగ్ చదువుతున్నారని తండ్రి అనారోగ్యంతో వారు ఉన్నత చదువులకు దూరం కాకుండా బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం సంపత్ భార్య అనురాధ బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ బాధ్యులు వెంకటేశ్వర్లు, పొన్నం రాజు, చిరంజీవి, రాజు, విజయ్, కొండల్‌రెడ్డి, మధు, పతంగి భాస్కర్, బరిగెల భాస్కర్, బోనాల రమేష్, సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత

ఖిలా వరంగల్: కరీమాబాద్ ఉర్సు బొడ్రాయి ప్రాంతానికి చెందిన స్వర్ణకారుడు రాగి సోమేశ్వరాచారీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి కృష్ణమాచార్యులు, రవీంద్రాచారి పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10వేలు, నిత్యావసర వస్తువులు అందజేశారు. సదానందం, వీరన్న, సత్యనారాయణ, పణికుమార్, సరిత, జగదీశ్వర్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న మోదీ

- పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యేలు నాయిని, రేవూరి

హన్మకొండ చౌరస్తా: భారత రాజ్యాంగాన్ని మోదీ సర్కారు అవహేళన చేస్తోందని కాంగ్రెస్ హనుమకొండ జిల్లా కమిటీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని డీసీసీ భవన్‌లో ఆదివారం వరంగల్, హనుమకొండ జిల్లాల పార్టీ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ నినాదంతో కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తోందని పేర్కొన్నారు. సమావేశానికి వరంగల్, హనుమకొండ జిల్లాల ఇన్‌చార్జులుగా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాయల నాగేశ్వర్‌రావు నియమితులైనట్లు వెల్లడించారు. అనంతరం బీజేపీ ప్రభుత్వం ద్వంద్వ విధానాలపై ఏర్పాటు చేసిన ప్రాజెక్టు వీడియోను ప్రదర్శించారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాలతో నిర్వహించిన సమావేశంలో వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, మేయర్ సుధారాణి పాల్గొన్నారు.

హన్మకొండ: జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. నాయిని విశాల్‌రెడ్డి ట్రస్టు ఆధ్వర్యాన ఫాక్స్‌కాన్ సంస్థ నేతృత్వంలో హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో ఆదివారం మహిళల మెగా జాబ్ మేలా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పెద్దపీట వేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన తరువాత ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ నిరంతరం కొనసాగుతోందని, కొత్త ఉద్యోగాల కల్పనకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నదని తెలిపారు. రానున్న రోజుల్లో ఐటీ, ఫార్మా, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఉపాధి అవకాశాల కల్పనపై దృష్టి సారించి ప్రముఖ కంపెనీలతో జాబ్ మేలా నిర్వహిస్తామన్నారు. ఫాక్స్‌కాని సంస్థ ప్రతినిధి ఆనంద్‌కుమార్, పరమేష్, పార్వతి వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

'జక్రియా'లో ఇఫ్తార్ విందు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనేక ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఖబరస్తాన్ ఏర్పాటు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం స్థలం కేటాయించిందని అన్నారు. అందుకు సంబంధించిన సర్క్యులర్ కాపీని మత పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం క్యావ, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మహ్మద్ రియాజ్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూపాషా, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, తోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో..

దేశాయిపేట: ఆదివారం రాత్రి ఎల్‌బీనగర్‌లోని క్రిస్టల్ గార్డెన్స్‌లో బీఆర్‌ఎస్ పార్టీ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విందులో వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముస్లిం మత పెద్దలు తదితరలు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం ఎన్నిక



కార్యవర్గాన్ని అభినందిస్తున్న పూర్వ విద్యార్థులు

రామన్నపేట : వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా ఈ.వీ. శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శిగా మేకల అక్షయ్‌కుమార్, కోశాధికారిగా పడిశాల ఆనంద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం స్వరసభ్య సమావేశాన్ని ఆదివారం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భగా ఐదేళ్ల కాలానికి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం సీనియర్ సలహాదారులుగా సుధాకర్‌రెడ్డి, స్వామి, ప్రకాశ్, రాంబ్రహ్మం, కొండల్‌రావు, రాఘవులు, ఎల్లయ్య, ఉమేందర్ సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 70 సంవత్సరాల పాలిటెక్నిక్ కళాశాలకు అధ్యక్ష బాధ్యతలు పొందడం సంతోషంగా ఉందన్నారు. బొద్దిరెడ్డి సతీష్‌రెడ్డి, రాజ్‌కుమార్, భిక్షపతి, ధర్మ శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, శ్రీనివాస్‌రావు, వసంత్‌కుమార్, మధు, అజీజ్, శ్రీవిద్య, జయశ్రీ, గిరివర్మ, దొడ్డిపల్లి కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

హన్మకొండ కల్చరల్ : మున్నూరు కాపు పరపతి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం హనుమకొండ పద్మాక్షి రోడ్‌లోని మున్నూరు కాపు పరపతి సంఘం కార్యాలయంలో ఎన్నుకున్నారు. సంఘం 41వ వార్షిక సర్వసభ్య సమావేశంలో.. సంఘం అధ్యక్షుడిగా తోటప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా కనుకుంట్ల రవికుమార్, కోశాధికారిగా బొల్లం అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా బండారి మహేందర్, సహాయకార్యదర్శిగా పోలు లక్ష్మణ్, ఆడిటర్‌గా గందె మధు, కార్యవర్గ సభ్యులుగా కనుకుంట్ల శ్రీనివాస్, యాహశెట్టి లక్ష్మణ్, కర్రు మనోజ్‌కుమార్, రాకేష్, రేవంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, గందె కృష్ణ, అంబటి కుమారస్వామి, పొటి శ్రీనివాస్, కర్రె సుదర్శన్ పాల్గొన్నారు.

కులగణన చేసి బీసీల వాటా ఇవ్వాలి

ఖిలా వరంగల్: మోదీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కులగణన చేసి బీసీల వాటా కేటాయించాలని బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింద కుమారస్వామి డిమాండ్ చేశారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన చట్టాన్ని అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిసిన అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఐ నేతలు దండు లక్ష్మణ్, ఓర్సు రాజు, వెంకన్న, కుమారస్వామి, రజిని పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్లు తప్పనిసరి

కాజీపేట: కాజీపేట పట్టణంలో తిరుగుతున్న ప్రతి ద్విచక్ర వాహనానికి ముందు, వెనకా నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని ట్రాఫిక్ సీఐ నాగబాబు హెచ్చరించారు. ఆదివారం వాహనాల తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇక నుంచి తరచూ వాహనాల నంబర్ ప్లేట్ల ఏర్పాటుపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయయనున్నట్లు తెలిపారు. కాజీపేట చౌరస్తాలో నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను అదుపులోకి తీసుకుని వాటి యజమానులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేని పలు వాహనాలకు ఈ–చలాన్ ద్వారా జరిమానా విధించారు.

కోతులను పట్టుకెళ్లారు

హసన్‌పర్తి: 65వ డివిజన్ ఎల్లాపురంలో కోతుల బెడదను నివారించారు. ఐదురోజులుగా కోతులను పట్టి బోన్‌లో బంధించారు. కోతులను అడవిలో వదిలి వేయనున్నట్లు కార్పొరేటర్ దివ్యారాణి ఆదివారం తెలిపారు. ఐదురోజుల పాటు సుమారు 200 కోతులను పట్టినట్లు కార్పొరేటర్ చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 24న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాంనగర్, పోలీసు హెడ్‌క్వార్టర్, స్కాలర్ స్కూల్, గోకుల్ నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 నుంచి 2.30 గంటల వరకు, భీష్మనగర్, శ్రీనివాస కాలనీ, బాలసముద్రం అపోలో హాస్పిటల్ ప్రాంతంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

హసన్‌పర్తి: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వాహనచోదకులు గాయపడ్డారు. ఈసంఘటన కరీంనగర్–హనుమకొండ ప్రధాన రహదారిలోని బాహుపేట సమీపంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం. ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లికి చెందిన రామారావు(45) నగరంలోని ప్రశాంత్‌నగర్‌లో కుటుంబసభ్యులతో ఉంటున్నాడు. శనివారం గుంటూరుపల్లికి వచ్చిన రామారావు తిరిగి రాత్రి బైక్‌పై ప్రశాంత్‌నగర్‌కు పయనమయ్యాడు. బాహుపేట సమీపంలో వెనుక నుంచి వస్తున్న మరో బైక్ రామారావును ఢీకొంది. దీంతో రామారావుకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మరో వాహనచోదకుడు రుత్విక్ గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

ఎగ్‌కార్డుల పంపిణీ

వరంగల్: జాతీయ నెక్ అధ్యక్షురాలు అనురాధ దేశాయి డ్రీమ్స్ ప్రాజెక్టు 'ఎగ్ కార్ట్స్ పథకం' లో భాగంగా 100మంది నిరుద్యోగ యువకులకు ఎగ్ కార్ట్స్‌ను నెక్ వరంగల్ జోన్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పంపిణీ చేశారు. వరంగల్ ఓసిటీలోని ఆయన స్వగృహం వద్ద ఆదివారం కార్టుల పంపిణీ అనంతరం ప్రదీప్‌రావు, నెక్ కోఆర్డినేటర్ అన్నామలై ఎజిల్‌కుమార్ మాట్లాడారు. ఎర్రబెల్లి వినీత్ రావు, రామారావు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

రామన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఆదివారం పెన్షనర్ల సంఘం జిల్లా శాఖ సమావేశం ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన సంఘం అసోసియేట్ అధ్యక్షుడు వీరాస్వామి, ఉపాధ్యక్షుడు రామ మనోహర్.. మాట్లాడారు. నరసింహారాములు, హనుమంతరావు, సుధాకర్, భిక్షపతి, జ్యోతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌ను ఎస్సీకి కేటాయించాలి

కాజీపేట రూరల్: కాజీపేట 48వ డివిజన్ దర్గాలోని శాస్త్రీనగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్ టీచర్ పోస్టును ఎస్సీలకు కేటాయించాలని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి మెంబర్ సింగారపు రవిప్రసాద్, అంబేడ్కర్ యువజన సంఘం 48వ డివిజన్ అధ్యక్షుడు ప్రేమ్‌నాథ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇక్కడ పని చేసిన టీచర్ ప్రమోషన్‌పై సూపర్‌వైజర్‌గా వెళ్లిందని అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు.

గీత కార్మికుల సంక్షేమానికి నిధులు పెంచాలి

కాజీపేట: రాష్ట్ర బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం రూ.68 కోట్లు మాత్రమే కేటాయించడం సరికాదని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాని సాంబయ్య గౌడ్ విమర్శించారు. కాజీపేట మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాదాపు 5లక్షల మంది గీత వృత్తిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నప్పటికీ నామమాత్రం నిధుల కేటాయింపుతో సంక్షేమం ఆటక్కెనట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌కు నివాళి



కేయూ క్యాంపస్: కేయూ మొదటిగేట్ వద్ద..



వరంగల్ అర్బన్: ఓంకార్ భవన్‌లో..

స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌కు ఆదివారం వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. వారి పోరాటాలను స్మరించుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్